క్లుప్తంగా

27న వాహనాల వేలం

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నమోదైన వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాల వేలం ఈనెల 27వ తేదీన ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నామని ఎక్సైజ్ డీటీఎఫ్ సీఐ బి.కృష్ణ సోమవారం తెలిపారు.

ఫేక్ ఫోన్ కాల్స్ నమ్మొద్దు

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీకి సంబంధించిన ఇంటి, నల్లా పన్నులు, లైసెన్స్‌ల, ఇతరత్రా పన్నుల విషయంలో మున్సిపల్ సిబ్బంది ఆన్‌లైన్ పోర్టల్ నుంచి ఫోన్ చేస్తున్నామని చెబితే వారిని నమ్మవద్దని మున్సిపల్ కమిషనర్ టి.ప్రసన్నరాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటికి వచ్చిన మున్సిపల్ సిబ్బందికి కాని కార్యాలయానికి గాని నేరుగా వచ్చి పన్నులు చెల్లించాలన్నారు. ఫేక్ ఫోన్ కాల్స్‌కు నమ్మి డబ్బులు చెల్లించవద్దన్నారు.

విద్యార్థినికి సన్మానం



కురవి: జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ మేళాలో విశేషంగా ప్రతిభ కనబరిచి రాష్ట్రపతి చేతులమీదుగా ప్రశంసలు పొందిన నేరడ మోడల్ స్కూల్ విద్యార్థిని నక్క భవానిని డాక్టర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ షేక్ జానీ, సర్పంచ్ గుండోజు శ్రీనివాసాచారిలు సోమవారం స్కూల్ ఆవరణలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అరుణ, ఉపాధ్యాయులు, స్కూల్ చైర్మన్ తిప్పిరిశెట్టి ప్రసాద్, కొలిపాక ఆంజనేయులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి



బయ్యారం: ఇల్లందులో మంగళవారం జరగనున్న నియోజకవర్గస్థాయి బీఆర్‌ఎస్ ఆత్మీయ సమావేశంను జయప్రదం చేయాలని ఇల్లందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అన్నారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో ఆమె మాట్లాడారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు గణేష్, రామ్మూర్తి, సొసైటీ ఉపాధ్యక్షులు సత్యనారాయణ, డైరెక్టర్ ప్రభాకర్ రెడ్డి, ఆత్మ కమిటీ సభ్యులు ఐలయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వేబ్రిడ్జి తూకంలో వ్యత్యాసం

కేసముద్రం: వేబ్రిడ్జి తూకంలో 20కేజీల వ్యత్యాసం వచ్చిందంటూ ఓ రైతు ఆందోళనకు దిగిన సంఘటన సోమవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బిచ్చానాయక్‌తండా జీపీ శివారు రాజీవ్‌నగర్‌తండాకు చెందిన గుగులోతు శివ అనే రైతు, పత్తిని అమ్మేందుకు మార్కెట్‌కు వచ్చాడు. ఈమేరకు ఓ కంపెనీకి చెందిన వ్యాపారి పత్తిని రూ.7,669లకు ఖరీదు చేశారు. నిర్మల్ వేబ్రిడ్జిపై పత్తిలోడు వాహనాన్ని తూకం వేశారు. ఆ తర్వాత ఖాళీ వాహనాన్ని తూకం వేయగా 1,390 కేజీలు చూపింది. అనుమానం కలిగిన ఆ రైతు మరో వేబ్రిడ్జిపై తూకం వేయడంతో 1,370 కేజీలు చూపింది. దీంతో తూకంలో 20 కేజీల వ్యత్యాసం వచ్చిందని ఆరోపిస్తూ తనకు న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు.

సామాజిక సేవలు ప్రశంసనీయం

మహబూబాబాద్: విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల శాఖ గౌరవ అధ్యక్షుడు బోల్లోజ్ రత్నమాచారి ఆధ్యాత్మిక, సామాజిక సేవలు ప్రశంసనీయమని టీఎస్ జీఆర్ఈఏ జిల్లా అధ్యక్షత, కార్యదర్శి మైస నాగయ్య, వలవోజు సోమయ్య కొనియాడారు. స్థానిక తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో స్వర్ణకార సంఘం రాష్ట్ర కమిటీ ఇటీవల రత్నమాచారికి దానకర్ణరత్న బిరుదును ఇవ్వగా ఆవిషయంలో సోమవారం రత్నమాచారి, సత్యవతి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐవీ రమణయ్య, మోహన్‌రావు, వెంకటేశ్వర్లు, రాములు, తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి ఉచిత ఫుట్‌బాల్ శిక్షణ శిబిరం

డోర్నకల్: స్థానిక బిషప్ గ్రౌండ్‌లో మంగళవారం నుంచి ఉచిత ఫుట్‌బాల్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించనున్నట్లు కెథడ్రాల్ యూత్ ఫుట్‌బాల్ క్లబ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ సలవాది మోజేస్ మనోహర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 17 సంవత్సరాల లోపు బాలబాలికలకు ఉదయం 6 గంటల నుంచి 8గంటల వరకు, సాయంత్రం 5గంటల నుంచి 7గంటల వరకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 20రోజుల పాటు జరిగే శిక్షణా కార్యక్రమం మంగళవారం ఉదయం 9గంటలకు ప్రారంభం కానుందని, బిషప్ గ్రౌండ్‌లో శిక్షణా శిబిరం నిర్వహన కోసం అనుమతినిచ్చిన బిషప్ కోడిరెక్క పద్మారావుకు మోజేస్ ధన్యవాదాలు తెలిపారు.

8వ రోజుకు చేరుకున్న వీఓఏల దీక్ష

నెహ్రూసెంటర్: వీఓఏల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఒంటికాలుపై నిలబడి వినూత్నంగా నిరసన తెలిపారు. వీఓఏల సంఘం మండల అధ్యక్షురాలు మాట్లాడుతూ.. ప్రభుత్వం స్పందించి వీఓఏలకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీఓఏలు చేపట్టిన సమ్మె శిబిరాన్ని బీఎస్పీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దార్ల శివరాజ్, నాయకులు సందర్శించి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో వీఓఏలు పవన్, లలిత, రోజా, శోభా, అరుణ, వీరన్న, రమేష్, అక్బర్, బీఎస్పీ నాయకులు పురుషోత్తం, అభినయ్, ఉపేందర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

దంతాలపల్లి: మండల కేంద్రంలో వీఓఏల సమ్మె సోమవారం నాటికి 8వ రోజుకు చేరుకుంది. మండల కేంద్రంలో వీఓఏలు మోకాళ్లపై సమ్మె చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కన్వీనర్ చింతల మౌనిక, మండల అధ్యక్షుడు చిల్ల నిరంజన్, కార్యదర్శి రాము, మంజుల, వీఓఏలు పాల్గొన్నారు.

గూడూరు: ప్రభుత్వం వీఓఏల సమస్యలను పరిష్కరిస్తూ, ఉద్యోగ భద్రత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు గుగ్గిళ్ల పీరయ్య మాదిగ అన్నారు. కార్యక్రమంలో వీఓఏలు శ్రీలత, యాకయ్య, భారతి, మల్లేష్, కల్యాణ్, లక్ష్మయ్య, వెంకటలక్ష్మి, రాజు పాల్గొన్నారు.

బయ్యారం: బయ్యారం బస్టాండ్ సెంటర్‌లో నిర్వహిస్తున్న దీక్షా శిబిరంను గొర్రెల, మేకల పెంపకదారుల సంఘం మండల అధ్యక్షులు మోహన్‌రావు, బయ్యారం ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ అధ్యక్షులు వెంకన్న సందర్శించి సంఘీభావం తెలిపారు.

గార్ల: గార్లలో వీఓఏల సమ్మె శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే బానోత్ హరిప్రియకు వీఓఏలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. బీఎస్పీ ఇల్లందు నియోజకవర్గ అధ్యక్షులు బాదావత్ ప్రతాప్ సమ్మెకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో బీఎస్పీ మండల అధ్యక్షుడు అజ్మీర వెంకన్న, జీవన్, దళపతి పాల్గొన్నారు.



నెహ్రూసెంటర్: ఒంటికాలుపై నిలబడి నిరసన తెలుపుతున్న వీఓఏలు



గార్ల: ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న వీఓఏలు



గూడూరు: సమ్మెకు మద్దతు తెలుపుతున్న పీరయ్య



దంతాలపల్లిలో..



బయ్యారం: దీక్షలో కూర్చున్న వీఓఏలు

సస్పెన్షన్ చేసే అధికారం కోర్ కమిటీకి ఉంది

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచందర్‌రావు



మాట్లాడుతున్న రామచందర్ రావు

మహబూబాబాద్ అర్బన్: బీజేపీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిన వారిని సస్పెన్షన్ చేసే నిర్ణయం బీజేపీ జిల్లా కోరు కమిటీకి ఉందని జిల్లా అధ్యక్షులు వద్దిరాజు రామచందర్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. పార్టీ కార్యక్రమాలకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో జిల్లా ఇన్‌చార్జ్‌ని, జిల్లా అధ్యక్షుడిని, జిల్లా ప్రధాన కార్యదర్శిని వ్యక్తిగతంగా నిరాధరణ ఆరోపణలు చేసిన పైండ్ల శ్రీనివాస్, కట్టోజు గంగాధర్, చుక్కల నరేష, మంచాల రాధాకృష్ణ ,ముల్లంగి ప్రతాప్ రెడ్డిలను సస్పెన్షన్ చేసినట్లు తెలిపారు. వీరు పార్టీ కార్యక్రమాలలో పాల్గొనకూడదన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షురాలు ఓర్సు పద్మావతి, పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ సింగారపు సతీష్, మానుకోట పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు సిరికొండ సంపత్, నాయకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర



పెద్దవంగర: కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న సర్పంచ్

పెద్దవంగర: మండలంలోని రామచంద్రుతండా, వడ్డెకొత్తపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ డైరెక్టర్ అనపురం రవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సర్పంచ్‌లు ప్రవీణ్‌రావు, చిలుకమ్మ ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జాటోతు అమల సక్రు, రైతుబంధు సమితి అధ్యక్షుడు జోజ్యా, వెంకన్న పాల్గొన్నారు.

కురవి: ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని ఎంపీపీ గుగులోత్ పద్మావతిరవినాయక్ అన్నారు. సోమవారం మండలంలోని నేరడ గ్రామంలో కురవి సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ దొడ్డగోవర్ధన్‌రెడ్డి, సర్పంచ్ గుండోజు శ్రీనివాసాచారి, సొసైటీ డైరెక్టర్ కృష్ణారెడ్డి, సొసైటీ డీసీఓ ప్రవీణ్, ఎండీ సుధాకర్, ఏఈఓ రాజేశ్వరీ, వార్డు సభ్యులు కాంతయ్య, ఉపేందర్, యాకన్న, లైబ్రరీ చైర్మన్ ఎస్‌కె జానీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

రహదారులపై తొలగించని చెట్లు



మరిపెడ రూరల్: గిరిపురం క్రాస్ రోడ్డు నుంచి-రాంపురం వెళ్లే దారిలో..



కొత్తగూడ: నాజీతండా సమీపంలో..

మరిపెడ రూరల్: ఈదురు గాలులకు మండలంలోని ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ రహదారులపై వందలాది చెట్లు కూలాయి. రోడ్లపై చెట్లు కూలీ నాలుగు రోజులైన సంబంధించిన అధికారులు సహాయక చర్యలు చేపట్టకపోవడంతో వాహనదారులకు ఇబ్బందిగా మారింది.

కొత్తగూడ: ఆదివారం రాత్రి వీచిన ఈదురు గాలులకు మహబూబాబాద్ జిల్లా కేంద్రం నుండి కొత్తగూడ మండలానికి ప్రధాన రహదారి పై నాజీతండా సమీపం రాళ్లవాగు వద్ద రోడ్డుపై తుమ్మ చెట్టు కూలింది. ఆర్‌అండ్‌బీ అధికారులు చెట్టును తొలగించక పోవడంతో మండలకేంద్రానికి రవాణా స్తంభించి పోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెట్టును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

హైవే పేరుతో అన్యాయం చేయొద్దు



ఆందోళన చేస్తున్న బాధితులు

మహబూబాబాద్: నేషనల్ హైవే బైపాస్‌ను ప్లాట్ల నుంచి ఇళ్ల నుంచి కాకుండా మొదట నిర్ణయించిన అనంతారం స్టేజ్ వద్ద నిర్మాణం చేయాలని బాధితులు రమేష్, రాజయ్య, సందీప్, శ్రీకాంత్ డిమాండ్ చేశారు. బాధితులు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేసి కార్యాలయంలో అదనపు కలెక్టర్‌లు అభిలాష అభినవ్, ఎం.డేవిడ్‌కు వినతిపత్రం అందజేశారు. కొనుగోలు చేసిన వారంతా పేద మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారే ఉన్నారన్నారు. హైవే పేరుతో పేదలకు అన్యాయం చేయవద్దన్నారు. కార్యక్రమంలో విజయ్, మురళి, నవీన్, వెంకటేశ్వర్లు, శ్రీను, లక్ష్మణ్, వెంకన్న, రవి పాల్గొన్నారు.

'కంటి వెలుగు' ప్రారంభం

మరిపెడ రూరల్: మండలంలోని వెంకట్‌తండాలో కంటివెలుగు శిబిరాన్ని సర్పంచ్ సోమవారం ప్రారంభించారు. కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ హీరధర్మ, కార్యదర్శి రాధిక, సోక్లో, లింగా, గుగులోతు రవి, బాలకిషన్, రాజా, భద్రాజీ, రాంలాల్ పాల్గొన్నారు. రాంపురంలో కంటి వెలుగు శిబిరాన్ని వైస్ ఎంపీపీ గాదె అశోర్‌రెడ్డి ప్రారంభించారు. సర్పంచ్ లావణ్యనర్సింహారెడ్డి, ఎంపీటీసీ కొమ్ము నరేష్, తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూసెంటర్: కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారధిరెడ్డి, 36వ వార్డు కౌన్సిలర్ బి.నీరజరెడ్డిధర్మన్న అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 36వ వార్డులో సోమవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ త్రివేణి, వైద్య సిబ్బంది చాందిని, ఏఎన్ఎం బబిత, అరుణ, లలిత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఏకపక్ష నిర్ణయం సరికాదు



మాట్లాడుతున్న నాయకులు

మహబూబాబాద్/మహబూబాబాద్ అర్బన్: సీఎం కేసీఆర్ కేటాయించిన రూ.50కోట్ల నిధుల విషయంలో కౌన్సిలర్లను విస్మరించి ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ ఏకపక్ష నిర్ణయం తీసుకోవడం సరికాదని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్‌ఫ్లోర్ లీడర్ వెన్నం లక్ష్మారెడ్డి, సీపీఎం మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సూర్నపు సోమయ్య, సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారధి రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ కౌన్సిలర్లతో పాటు అధికార పార్టీ కౌన్సిలర్లు ఎడ్ల వేణుమాదవ్, హరిసింగ్, బుజ్జి వెంకన్న, విజయమ్మతోపాటు పలువురు కౌన్సిలర్లు సమావేశం అయ్యారు. నిధుల విషయంలో ఎమ్మెల్యే వ్యవహరిస్తున్న తీరుపై త్వరలో భవిష్యత్ కార్యచరణ ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పోతురాజు, నీరజారెడ్డిదర్మన్న, నాగలక్ష్మి, జగన్, కోఆప్షన్ సభ్యుడు నిమ్మల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు పోరాటం చేయాలి



మాట్లాడుతున్న సంజీవరావు

మహబూబాబాద్ అర్బన్: అంబేడ్కర్ ఆలోచన విధానంపై పని చేయడానికి యువత ముందుకు రావాలని తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కామ సంజీవరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో సోమవారం జిల్లా ఉపాధ్యక్షుడు తప్పెట్ల వీరన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ ఇచ్చిన హక్కుల కోసం పోరాటం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నీరుడు సామెల్, జిల్లా ఉపాధ్యక్షులు మందుల కృష్ణమూర్తి, జిల్లా కోశాధికారి ఐతం వెంకటేశ్వర్లు, జిల్లా సహాయ కార్యదర్శి కనకం బాబు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణతో మహిళలకు ఉపాధి



తొర్రూరు రూరల్: మాట్లాడుతున్న శ్రీనివాస్

తొర్రూరు రూరల్: కుట్టు శిక్షణతో మహిళలకు ఉపాధి లభిస్తుందని ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని అమ్మాపురం, హరిపిరాల, నాంచారి మడూరు గ్రామాల్లో సెర్ప్, స్త్రీ నిధి సంస్థల ఆధ్వర్యంలో రెండో విడత కుట్టు శిక్షణా శిబిరం ప్రారంభమైంది. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఇట్టె శ్యామ్ సుందర్‌రెడ్డి, సర్పంచులు గుంటుక యాదలక్ష్మి, పోసాని పుష్పలీల, మాలోతు కాలునాయక్, కడెం యాకయ్య, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధితోనే పురోగతి

పెద్దవంగర: మహిళల ఆర్థికాభివృద్ధితోనే కుటుంబ.. దేశం పురోగతి సాధిస్తుందని ఎంపీపీ రాజేశ్వరి, జెడ్పీటీసీ జ్యోతిర్మయి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ రామచంద్రయ్య శర్మ అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు చిట్యాల గ్రామంలోని రైతు వేదికలో సెర్ప్ మరియు స్త్రీనిధి సాకారంతో రెండో విడత ఉచిత కుట్టు మిషన్ శిక్షణ తరగతులు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ రావుల శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఎం నరేంద్రకుమార్, నాయకులు సోమయ్య, శ్రీరాం సుధీర్, వసంత, తదితరులు పాల్గొన్నారు.

పన్నుభారం విరమించుకోవాలి

నెహ్రూసెంటర్: చిరువ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న చిరువ్యాపారాలపై పన్నుల భారం తగ్గించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో చిరువ్యాపారుల సమావేశం సోమవారం నిర్వహించారు. అనంతరం స్ట్రీట్ వెండర్స్ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు కుంట ఉపేందర్ తెలిపారు. అధ్యక్షుడిగా పులిగుజ్జు వెంకన్న, ఉపాధ్యక్షుడిగా కొమ్ము శ్రీను, కవిత, కార్యదర్శిగా తోట పుష్ప, సహాయ కార్యదర్శులుగా ఆనంద్, లక్ష్మణ్, కోశాధికారిగా షేర్లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

దోపిడీ పాలకులకు చరమగీతం పాడాలి

గూడూరు: అసంఘటిత హక్కులను కాలరాస్తూ, దోపిడీకి పాల్పడుతున్న కేంద్ర, రాష్ట్ర పాలకులకు చరమగీతం పాడాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమాక్రసీ ఏఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు, గూడూరు, కొత్తగూడ, గంగారం ఏరియా కమిటీ కార్యదర్శి పసునూరి రాజమల్లు అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం మేడే వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు నర్సయ్య, కుమారస్వామి, నరేష్, రామచంద్రు, భద్రు, ప్రతాప్, సురేష్, ఈర్యా పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

డోర్నకల్: మండలంలోని ముల్కలపల్లి తిరుతమ్మ తల్లి ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయ పూజారి చెన్నబోయిన రామ్మూర్తి సోమవారం ఉదయం ఆలయానికి రాగా తలుపులు తెరిచి ఉండటం హుండీ కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించాడు. తిరుపతమ్మతల్లి మెడలో సుమారు తులం బరువు కలిగిన మూడు బంగారు పుస్తెలు చోరీకి గురయ్యాయి. హుండీని ఎత్తుకెళ్లి ఆలయానికి కొద్ది దూరంలో పడేశారు. ఆలయాన్ని సీఐ వెంకటరత్నం, ఎస్సై శ్యాంసుందర్ తదితరులు పరిశీలించగా క్లూస్ టీం ఆధారాలను సేకరించారు.

సంక్షిప్త సమాచారం

మత్స్యశాఖ అధికారికి వినతి

నెహ్రూసెంటర్: మండలంలోని ఉమ్మడి నడివాడ జీపీ పరిధిలో గల గడ్డిగూడెం చెరువులో అక్రమంగా చేపలు పట్టిన విషయంపై గ్రామస్తులు జిల్లా మత్స్యశాఖ అధికారి నాగమణికి సోమవారం వినతిపత్రం అందజేశారు. నడివాడ ముదిరాజ్ కుటుంబాలను, జీపీ ప్రజలను ఆదుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్మదగుట్టయ్య, ఎంపీటీసీ శ్రీపాల్‌రెడ్డి, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొడుగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

నివాళి

కురవి: మండలంలోని బలపాల గ్రామానికి చెందిన నెల్లూరి శ్రీనివాసరావు తల్లి మాణిక్యమ్మ ఇటీవల మృతి చెందింది. ఈమేరకు బీఆర్‌ఎస్ ఎంపీ నామా నాగేశ్వర్‌రావు సోమవారం బలపాల గ్రామంలోని మృతురాలి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట రైతు బంధు ఖమ్మం జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు, సింహాద్రియాదవ్, ప్రసాద్, శ్రీనివాసరావు, సర్పంచ్ ప్రమీల, పాల్గొన్నారు.

మే 7న భరోసా సభ

మహబూబాబాద్ అర్బన్: హైదరాబాద్‌లో మే7న నిర్వహించే బీఎస్పీ తెలంగాణ భరోసా సభను విజయవంతం చేయాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి దార్ల శివరాజ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన సన్నాహక సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి దార్ల శివరాజ్ హాజరై మాట్లాడారు. సమావేశంలో జిల్లా ఇన్‌చార్జ్ విజయ్‌కాంత్, జిల్లా అధ్యక్షుడు తేజావత్ అభినాయక్, ఉపాధ్యక్షుడు నాగన్న పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

తొర్రూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ గుగులోతు రాము అన్నారు. సోమవారం మండలంలోని అమ్మాపురం ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం మురళీకృష్ణ అధ్యక్షతన పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కడెం యాకయ్య, ఎస్ఎంసీ చైర్మన్ సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణ విద్యలు నేర్చుకోవాలి

తొర్రూరు: విద్యార్థులు ఆత్మరక్షణ విద్యలు నేర్చుకోవాలని ఎస్సై గంగ్రాతి సతీష్ అన్నారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో బాలికలపై జరిగే దాడులు, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు ఎస్సై రాంజీనాయక్, కేజీబీవీ ప్రత్యేకాధికారి శైలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలి

మరిపెడ: ఆరోగ్య కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య సదుపాయాల గురించి వివరించాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గుగులోతు రవికుమార్ అన్నారు. స్థానిక ఆడిటోరియంలో సోమవారం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాధకుమారి, సక్రి, శాంత, బీవీ రమణ, శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

మరిపెడ రూరల్: మరిపెడ మండలం యలమంచిలితండా గ్రామ పంచాయతీ పరిధికి చెందిన బానోత్ వెంకటి అనారోగ్యంతో, బానోత్ సాయి అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట సర్పంచ్ పార్వతిమంగిలాల్, బీఆర్‌ఎస్ నాయకులు హరీశ్, దామ్లు, భద్రు, ప్రవీణ్ పాల్గొన్నారు.

భక్తిభావంతో సత్ప్రవర్తన

గూడూరు: దైవ భక్తిభావం ప్రతీ ఒక్కరిలో సత్ప్రవర్తన కల్గిస్తుందని, మాలాధారణ సన్మార్గానికి దారి చూపుతుందని సనాతన శివాలయ చైర్మన్ డాక్టర్ ఏపూరు రవీందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సనాతన శివాలయంలో సోమవారం ఇటీవల గూడూరు నుంచి భద్రాచలం పాదయాత్ర చేసి వచ్చిన మండల కేంద్రానికి చెందిన హనుమాన్ మాలాధరులను ఆయన శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సనాతన శివాలయ అధ్యక్షుడు బీరం శ్రీపాల్‌రెడ్డి, పూజారి వలబోజు భానుప్రకాష్‌శాస్త్రి, మాలధారులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

నర్సింహులపేట: మండలంలోని పెద్దనాగారంలో సోమవారం అకాల వర్షానికి నష్టపోయిన పంటలను తహసీల్దార్ వివేక్, హెచ్ఓ రాకేష్, ఏఈఓలు పరిశీలించారు. రైతులకు నష్టపరిహారం వచ్చేలా కృషి చేస్తామని తహసీల్దార్ తెలిపారు.

వాహనాల తనిఖీ

చిన్నగూడూరు: మండల కేంద్రంలో సోమవారం ఎస్సై గంధ్ర సంతోష్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో భాగంగా పలు వాహన రికార్డులను పరిశీలించి సిబ్బందితో వాహనాలకు రేడియో స్టిక్కర్‌లను అంటించారు.

మెటీరియల్‌ను ధ్వంసం చేసిన కోతులు

నర్సింహులపేట: మండలంలోని పడమటిగూడెం గ్రామంలోని కంటి వెలుగు మెటీరియల్‌ను కోతులు ధ్వంసం చేశాయి. ఆదివారం సెలవు కావడంతో కంటి వెలుగు నిర్వహిస్తున్న సెంటర్‌లోకి కిటికిల డోర్‌లు లేకపోవడంతో లోనికి వెళ్లి మెటీరియల్‌ను ధ్వంసం చేశాయి.

లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

కొత్తగూడ: లేబర్ కోడ్స్ రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ కొత్తగూడ, గంగారం ఏరియా కార్యదర్శి రాజమల్లు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక న్యూడెమోక్రసీ కార్యాలయంలో మేడే వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కుమారస్వామి, శ్రీను, వీరాస్వామి, బాలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి

తొర్రూరు రూరల్: మండలంలోని పిల్లిగుండ్ల తండాకు చెందిన ధరావత్ జవహర్‌లాల్ అనే రైతు సోమవారం తొర్రూరు శివారులోని వ్యవసాయ క్షేత్రంలో ఎద్దును మేపుతుండగా విద్యుత్ తీగలు తగిలి పశువు అక్కడికక్కడే మృతి చెందింది. దాని విలువ రూ.50వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరారు.

పొదుపుపై విద్యార్థులకు అవగాహన

నెల్లికుదురు: ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల్లో పొదుపు చేసే గుణాన్ని పెంపొందించాలని ఎంఈఓ గుగులోతు రాము, జిల్లా ఇన్‌క్లూజివ్, సీఎంఓ కో ఆర్డినేటర్ ముఖేష్ అన్నారు. మండలంలోని రామన్నగూడెం, మునిగలవీడు, వావిలాల గ్రామాలతోపాటు వివిధ గ్రామాలల్లో పేరెంట్స్ సమావేశాలకు హాజరై వారు మాట్లాడారు. పాఠశాల స్థాయినుంచే విద్యార్థులకు పొదుపుపై అవగాహన పెంచాలని హెచ్ఎంలకు సూచించారు. హెచ్ఎంలు దాశరధి శ్రీధర్, యాకేందర్, లింగమూర్తి పాల్గొన్నారు.

ప్రోగ్రెస్ కార్డుల అందజేత

మరిపెడ రూరల్: నేటి నుంచి పాఠశాలలకు వేసవి సెలువులు మొదలైనందున విద్యార్థులను వారి తల్లిదండ్రులు జాగ్రత్తగా కాపాడుకోవాలని గాలివారిగూడెం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భర్తపురం మురళీధర్ కోరారు. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు విద్యార్థులకు సీసీఈ ఆన్‌లైన్ ప్రోగ్రెస్ కార్డులు చివరి రోజు సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకన్న, షేక్ ఫైజుద్దీన్, బాలు, లింగాల మహేష్‌గౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

జేపీఎస్‌లను క్రమబద్ధీకరించాలి



మహబూబాబాద్: సీఎంకు పోస్ట్‌కార్డులు పంపిస్తున్న జేపీఎస్‌లు



గార్ల: పోస్టుకార్డులను చూపిసున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

మహబూబాబాద్/మహబూబాబాద్ రూరల్/పెద్దవంగర/గార్ల: జూనియర్ పంచాయితీ కార్యదర్శుల ప్రొబేషన్ పీరియడ్ డిక్లేర్ చేసి, ఉద్యోగ క్రమబద్ధీకరణ చేయాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సోమవారం సీఎం కేసీఆర్‌కు పోస్టుకార్డులు రాసి పంపించారు.

ప్లీనరీని విజయవంతం చేయాలి

మహబూబాబాద్: బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 25న నిర్వహించే పార్టీ నియోజకవర్గ స్థాయి ప్లీనరీని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే శంకర్‌నాయక్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రం శివారు ఆర్తిగార్డెన్‌లో ప్లీనరీ వేదిక ఇతరత్రా ఏర్పాట్లను సోమవారం ఎమ్మెల్యే పరిశీలించారు. చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్, నాయకులు రవి, ఖాసీం పాల్గొన్నారు.

అదనపు చార్జీలు వసూలు

కేసముద్రం: మండల కేంద్రంలో కొన్ని మీసేవ కేంద్రాల్లో నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా భూమి కోసం దరఖాస్తులు చేసుకున్న పలువురు రైతుల వద్ద అదనంగా రూ.1,500నుంచి రూ.2వేల వరకు వసూలు చేస్తున్నారని ఎన్‌హెచ్‌ఆర్‌సీడబ్ల్యూఈఓ జిల్లా సెక్రటరీ సోమారపు శ్రీరాములు సోమవారం ఆరోపించారు.